

నేడు అనంతలో సదస్సు

హాజరుకానున్న కేరళ మాజీ మంత్రి పికె.శ్రీమతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు అనంతపురం టిడిపి కళ్యాణ మండపంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహిళా సదస్సును నిర్వహిస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.సావిత్రి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్‌లు తెలిపారు. సదస్సుకు ముఖ్య వక్తగా కేరళ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పికె.శ్రీమతి హాజరవుతారన్నారు. మహిళా దినోత్సవానికి వందేళ్లు దాటిన చరిత్ర ఉందన్నారు. మహిళా హక్కుల కోసం ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరిగాయన్నారు. భవిష్యత్తులోనూ వాటిని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు అనంతపురంలో నిర్వహించే మహిళా సదస్సుకు మేధావులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


ఆమెపై ఆగని అఘాయిత్యాలు..!



◆ శిక్షల్లోనూ జాప్యమే ◆ బాధితులకు అందని పరిహారం

మహిళ ఎందులోనూ తక్కువ కాదు... పురుషులతో సమానమే అంటూ వల్లేవేసి మాటలు చేతల్లో కనిపించడం లేదు. ఆమెపై అణిచివేత, అఘాయత్యాలు ఆగడం లేదు. ఒంటరిగా బయటకే కాదు... కుటుంబంలోనూ సురక్షితంగా ఉండలేని దయనీయ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అఘాయిత్యానికి గురైన వారికి అందుతున్న సహకారం, సహాయమూ ప్రభుత్వం వైపు నుంచి నామమాత్రమనే చెప్పాలి. ఇదోరకమైన వివక్ష ప్రభుత్వం వైపు నుంచి ఎదురవుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



మహిళలపై రోజురోజుకు హింస పెరుగుతూనే ఉంది. 2021, 2022 సంవత్సరాల్లో చోటు చేసుకున్న నేర గణాంకాలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తాయి. 2021 సంవత్సరలో అనంతపురం జిల్లా పరిదిలో రెండు వరకట్న వేధింపు హత్యలు జరిగితే 2022లో అవి ఆరుకు పెరిగాయి. 2021 సంవత్సరంలో జిల్లాలో జరిగిన మొత్తం కిడ్నాపులు 40 అయితే అందులో 32 మంది మహిళలే కిడ్నాప్ గురైయ్యారు. 2022లో మొత్తం 31 జరిగితే అందులో 28 మంది మహిళలు ఉన్నారు. వరకట్న వేధింపు కేసులు 2021లో 209 జరిగితే, 2022 సంవత్సరంలో 248 నమోదయ్యాయి. ఫోక్సో చట్టం కింద 89 కేసులు నమోదయ్యాయి. ఇలా మహిళలపై అఘాయిత్యాలు అధికంగా ఉంటున్నాయి.

బాధితులకు న్యాయం ఏది. ?

మహిళపై అఘాయిత్యం జరిగితే మూడు వారాల్లోపు శిక్ష పడే విధంగా పాస్టుట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి 2019లోనే ప్రకటించారు. ఈ మేరకు దిశ చట్టాన్ని తీసుకొచ్చారు. కాని ఇవి ఇంతవరకు కార్యరూపం దాల్చలేదనే చెప్పాలి. ఇందుకు జిల్లాలో ధర్మవరం ప్రాంతంలో జరిగిన యువతి అత్యాచారమే ఉదాహరణగా చెప్పవచ్చు. అప్పట్లో ఈఘటన రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చనీయాంశం అయ్యింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో ఆందోళనలను సద్దుమనిచేందుకు ప్రభుత్వం తక్షణం బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని ఇచ్చారు. అయితే ఈ కేసు 2020 డిసెంబరు 24న నమోదు అయ్యింది. ఇప్పటికి రెండేళ్లు పూర్తయినా నిందితులకు ఇంకా శిక్ష పడలేదు. ఈ ఏడాది జనవరిలో ఈ కేసు హియరింగ్‌కు వచ్చింది. ఇది పూర్తయి శిక్ష ఖరారయ్యేందుకు ఇంకెంత సమయం పడుతుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే సమయంలో కొద్ది రోజుల వ్యవధిలో కళ్యాణదుర్గం ప్రాంతంలోనూ ఒక అమ్మాయిపై అత్యాచారం జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులోనూ నిందితులకు ఇప్పటికీ శిక్ష పడలేదు.

కొందిమందికే పరిహారం

పోక్సో చట్టం కింద బాలికలపై అఘాయిత్యాలు జరిగినప్పుడు వారికి ఆర్థిక తోడ్పాటును అందించి న్యాయం కోసం పోరాడేందుకు సహకారం అందించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంది. డిస్ట్రిక్ లీగల్ సెల్ అథారిటీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఈ బాధ్యతలు నిర్వర్తించాలి. కేసు నమోదయిన సమయంలో బాలికపై జరిగిన అఘాత్య తీవ్రతను బట్టి పరిహారాన్ని రూ.1.50 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పరిహారమివ్వాలని ఉంది. ఇందులో ప్రాథమికంగా 25 శాతమైనా బాధితురాలి కుటుంబానికి అందజేయాలని చట్టం చెబుతోంది. కాని ఉమ్మడి జిల్లాలో చూసినప్పుడు మొత్తం 98 పోక్సో చట్టం కింద కేసులు నమోదై ఉన్నాయి. ఇందులో ఐదారు కేసుల్లో మాత్రమే పరిహారం అందింది. తక్కిన కేసుల్లో ఏ మాత్రం పరిహారం అందని పరిస్థితి ఉంది. 2018 నుంచి ఇప్పటి వరకు అదే పరిస్థితి కొనసాగుతూపోతోంది.

బాధితులకు అండగా నిలవాలి

భానుజ, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి.

సమాజంలో మహిళలపై హింస రోజురోజుకూ పెరుగుతూ పోతోంది. ఇటువంటి సమయాల్లో వాటిని ఎదుర్కొని నిలబడే విధంగా బాధితులుగానున్న వారికి తోడ్పాటు అందనివ్వాల్సిన అవసరముంది. ఆ రకంగా ఉండేందుకు వీలుగా ప్రత్యేకమైన వ్యస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాని దురదృష్టం ఆ వ్యవస్థలూ అంతగా బాధితులకు అండగా నిలబడటం లేదేమో అనిపిస్తోంది. పైగా ఇటువంటి వారిపట్ల సమాజంలోనూ ఒకరకమైన వివక్ష, చిన్నచూపు కొనసాగుతుండటం విచారకరం. ఇప్పటికైనా ప్రభుత్వాలు బాధితులకు అండగా ఉన్నామని భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

'ఆకలితో అలమటిస్తున్నాం'.!!

◆ కన్నీటి పర్యవంతం అయిన ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ◆ ఎంపిపి ఎదుట సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-ఉరవకొండ

"కడుపు నిండా అన్నం పెట్టడం లేదు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంతోనే కడుపు నింపుకుంటున్నాం. కనీసం మా గురించి పట్టించుకునే వారు ఎవరూ లేరు' అంటూ విడపనకట్లు మండలం గడేకల్ గ్రామ ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హాస్టల్‌లో 5 నుంచి 10వ తరగతికి చెందిన విద్యార్థులు 62 మంది ఉంటున్నారు. హాస్టల్‌లో ఉంటూ గడేకల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా హాస్టల్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వార్డెన్‌తో పాటు సిబ్బంది, ఇక్కడ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. సమయానికి భోజనం లేక ఆకలితో అలమటించే పరిస్థితి నెలకొందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్లో మౌలిక వసతులు కల్పించడంలోనూ నిర్లక్ష్యం కన్పిస్తోంది.



ఎంపిపి పంపిన టిఫిన్ ప్యాకెట్లను తీసుకుంటున్న గడేకల్ ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

ఎంపిపి ఎదుట సమస్యల ఏకరువు

గడేకల్ హాస్టల్ విద్యార్థులు వారి సమస్యలను ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి ఎదుట ఏకరువు పెట్టారు. ఎంపిపి స్వగ్రామం అదే కావడంతో మంగళవారం నాడు విద్యార్థులు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. హాస్టల్‌లో గత పది రోజులుగా అన్నం కూడా సరిగా పెట్టడం లేదన్నారు. ఉదయం టిఫిన్, రాత్రి భోజనం ఏమాత్రం రుచికరంగా ఉండదని, మధ్యాహ్నం సమయంలో ప్రభుత్వ పాఠశాలలో ఇచ్చే అన్నంతోనే కడుపు నింపుకుంటున్నామని చెప్పారు. హాస్టల్‌కు ఇన్‌ఛార్జి వార్డెన్ ఉన్నారని, ఆయన స్థానికంగా ఉండడం లేదన్నారు. ఏదైనా సమస్య ఉంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదంటూ ఎంపిపి ఎదుట విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఇన్‌ఛార్జి వార్డెన్‌పై ఎంపిపి ఆగ్రహం

విద్యార్థుల సమస్యలను విన్న ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి చలించిపోయారు. వెంటనే వారికి టిఫిన్ తెప్పించి ఆకలి తీర్చారు. అనంతరం ఇన్‌ఛార్జి వార్డెన్ జగన్నాథ్‌ను ఫోన్‌లో సంప్రదించారు. విద్యార్థులకు సరిగా అన్నం పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌కు రాకుండా ఎక్కడో ఉండి విధులు నిర్వహించడం సమంజసం కాదన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకోవడానికి హాస్టల్‌లో ఉంటే వారిపట్ల బాధ్యతా రహితంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో హాస్టల్‌లో సిబ్బంది ఎవరూ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకుని విద్యార్థులకు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలూ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా స్థాయి సోషల్ వెల్ఫేర్ అధికారులతో ఫోన్లో మాట్లాడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిబంధనల అమలు తప్పనిసరి

◆ పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించాలి ◆ ఆరు జిల్లాల అధికారులతో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేసి, సజావుగా మండలి ఎన్నికల ప్రక్రియ సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మండలి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై కడప, కర్నూల్, అనంతపురం, అన్నమయ్య, నంద్యాల, శ్రీ సత్యసాయి జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీఆర్వోలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్ నుంచి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రి నిర్వహణ, అధికారులకు శిక్షణ కార్యక్రమాలు, పోలింగ్ డే రోజు కార్యక్రమాలు ఇలా ప్రతి అంశంలోనూ అధికారులకు స్పష్టమైన విధివిధానాలు ఉన్నాయని, వీటిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పోలింగ్ రోజున సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వారికి వీలైనంత ముందుగానే పోస్టల్ బ్యాలెట్ పేపర్ అందించాలన్నారు. 800 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో జంబో పోస్టల్ బాక్సులు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డీఆర్వో గాయత్రీ దేవి, ఆన్సెట్ సీఈవో కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సరైన ప్రణాళికతో పోలింగ్ ఏర్పాట్లు

కళ్యాణదుర్గం, బెళుగుప్ప : బూత్ స్థాయి నుంచి సరైన ప్రణాళికతో పోలింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కళ్యాణదుర్గం జెడ్పీ ఉన్నత పాఠశాల, బెలుగుప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అక్కడి సిబ్బంది పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళిక తయారు చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు, పోలింగ్ ఏజెంట్ల ప్రాంతం, బ్యాలెట్ పేపర్ నిర్వహణకు అనుగుణంగా బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. మండల కేంద్రం, మునిసిపాలిటీలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు కొత్తవారు సైతం గుర్తించగలిగేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రం నుంచి వెబ్ కాస్టింగ్ చేసేందుకు హై స్పీడ్ ఇంటర్నెట్ వసతి కల్పించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌పై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలింగ్ నిమిత్తం మార్చి 13వ తేదీ సెలవు దినంగా ప్రకటించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నిశాంత్ రెడ్డి, కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగరాజు, కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, కళ్యాణదుర్గం ఎస్ఐ నాగమధు, బెళుగుప్ప తహశీల్దార్ ఈశ్వరయ్య, ఎంపీడీవో యాదవేంద్ర పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక పార్టీలకు కనువిప్పు కలిగించాలి

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి - సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి బూర్జువా పార్టీలకు కనువిప్పు కలిగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్ మండల కేంద్రాల్లో నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్, ఎంపిడిఒ, రైతుభరోసా, సబ్ రిజిస్టర్, ఉపాధి హామీ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఎన్నుకున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజా ఉద్యమాలకు అండగా ఉండడంతోపాటు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పేదల గొంతుకగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారన్నారు. అంతేగాకుండా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా సామాన్య జీవితం గడుపుతూ పేదల్లో ఒకరిగా జీవిస్తున్నారన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యలైన అప్రెంటీస్ విధానం రద్దు, నేషనల్ ఇంక్రిమెంట్లు, గిరిజన, మున్సిపల్ టీచర్ల సర్వీస్ రూల్స్, టీచర్లకు 010 ద్వారా జీతాలు, పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంపు, డిగ్రీ కళాశాల లెక్చరర్లకు యూజీసీ స్కేల్స్, కాంట్రాక్ట్ లెక్చరర్స్‌కు మినిమం టైంస్కేల్, జూనియర్ కళాశాల లెక్చరర్స్, మోడల్ స్కూల్, కేజీబీవీ, అంగన్‌వాడీ రెసిడెన్షియల్ పాఠశాల టీచర్ల సమస్యలు పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. కావున రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచి పేదల గొంతుకుగా ఉండే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను కచ్చితంగా గెలిపించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకురాలు నాగమణి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, వజ్రకరూరు మండల కన్వీనర్ విరుపాక్షి, యానిమేటర్ల సంఘం జిల్లా నాయకులు పద్మావతి, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లను అభ్యర్థిస్తున్న సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

శింగనమల : పిడిఎఫ్ బలపరుస్తున్న పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా అనేక ఉద్యమాల్లో భాగస్వామ్యం అయిన పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని శాసనమండలికి పంపితే ప్రజలు గొంతుకగా నిలిచి ప్రజల సమస్యలపై నిలదీస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, మునెప్ప, కేశప్ప, కృష్ణమూర్తి, నల్లప్ప, కుమార, నాగేంద్ర, శంకర, నరసింహా, రత్నక్క, చంద, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, నాగేంద్ర, పెద్దన్న, నరసింహా, ప్రభాస్, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.



శింగనమలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కరపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

పెద్దారెడ్డి 'యాత్ర' ఆదర్శం

గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర మాకందరికీ ఆదర్శమని, త్వరలో తన నియోజకవర్గంలో కూడా యాత్ర చేపడతానని గుంతకల్లు ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి తెలిపారు. ప్రజా సంక్షేమ యాత్ర మంగళవారం చాగల నుంచి ప్రారంభమై తబ్జులా.1, తబ్జులా.2, సింగనగుట్టపల్లి గ్రామాల మీదుగా సాగింది. ఈ యాత్రకు సంఘీభావం తెలుపుతూ ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడంతోపాటు ప్రజలతో మమేకమై పెద్దారెడ్డి పాదయాత్ర నిర్వహించడం సంతోషకరమన్నారు. త్వరలో తన నియోజకవర్గంలో కూడా ఇలాంటి యాత్ర చేపడతామన్నారు. అంతేగాకుండా ఈ యాత్రతో ఎమ్మెల్యే పెద్దారెడ్డి పేదలు, బడుగు, బలహీన వర్గాలకు మరింత దగ్గరయ్యారన్నారు. ఇకపోతే ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సింగనగుంటపల్లిలో పలువురు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రమాదేవి, జాతీయ ఉపాధి హామీ పథకం వేమనాథరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మూర్తిరెడ్డి, ఉపాధ్యక్షులు రామయ్య, కళావతి, సింగనగుంటపల్లి నారాయణరెడ్డి, సురేంద్ర, అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, ముచ్చుకోట అమర్నాథ్‌రెడ్డి, అమ్మలదిన్నె రామచంద్రారెడ్డి, నానాంకంపల్లి వెంకటేశ్వరరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసిపిలోకి చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యేలు వైవిఆర్, పెద్దారెడ్డి



ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేస్తున్న నగరపాలక సంస్థ కార్యదర్శి సంఘం శ్రీనివాసులు

రెండు టన్నుల ప్లాస్టిక్ వస్తువులు సీజ్

నగరపాలక సంస్థ కార్యదర్శి సంఘం శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశం మేరకు నగరంలో రెండు టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసినట్లు నగరపాలక సంస్థ కార్యదర్శి సంఘం శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్రటరీ, హెల్త్ ఆఫీసర్ కె.గంగాధర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది అధ్వర్యంలో మంగళవారం నగరంలోని శ్రీకంఠం సర్కిల్ సమీపంలోని హోటళ్లు, కిరాణా దుకాణాలు, కూరగాయలు, పూల మార్కెట్లలో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదన్నారు. అయినా పలు దుకాణాల్లో ప్లాస్టిక్ వాడుతుండటంతో దాడు చేసి సీజ్ చేయడంతోపాటు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది ఆంజనేయులు, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు తిప్పేస్వామి, ఇస్మాయిల్, ప్రతాప్, కేధార్, శంకర్, గంగాధర్, మహిళా పోలీసులు సుకన్య, దీప్తి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్గో ద్వారా ఆర్టీసీ ఆదాయం పెంపు

రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆధోని

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్టీసీ కార్గో రవాణా, ఆదాయం పెంచి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సూచించారు. మంగళవారం నగరంలోని రీజినల్ కార్యాలయంలో అనంతపురం రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బస్ సర్వీసు పనితీరును సమీక్షించడంతోపాటు సెక్టార్ వారీగా పనితీరు బాగా లేని సర్వీసులను రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు. అలాగే కార్గోలో స్వీకరించిన వస్తువులను వెంటనే డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కెఎంపిఎస్ పెంచాలని, బ్రేక్‌డౌన్‌లను తగ్గించి ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే ప్రమాదాల నివారణకు డ్రైవర్లందరికీ అవగాహన కల్పించి ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో పిఎంఇ మోహన్‌కుమార్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

సబ్సిడీతో పశుగ్రాసం విత్తనాలు

పుట్లూరు : మండలం వ్యాప్తంగా వేసవిలో పశుగ్రాస సమస్యలు తలెత్తకుండా సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారి సువర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పశువైద్యశాలలో 75 శాతం సబ్సిడీతో పంపిణీ చేసేందుకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్సిడీ పోను ఐదు కిలోల ప్యాకెట్ ధర రూ.115 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కళ్యాణదుర్గం : రబీ సీజన్‌లో పాడి పశువుల పశుగ్రాసం కోసం 75 శాతం రాయితీతో అందించే గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పశుసంవర్ధకశాఖ సంచాలకులు శ్రీనివాసగుప్త మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీహెచ్ఎఫ్-23 రకం (కాకిమారి జొన్నలు) రూ.115తో 5కిలోలు అందించనున్నట్లు తెలిఆపరు. కళ్యాణదుర్గం ఏరియా పశువైద్యశాలలో 3000 కిలోలు, బెళుగుప్ప, గంగవరం కేంద్రాల్లో 500 కిలోల చొప్పున స్టాక్ ఉందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్‌కార్డు, రైతు పట్టాదారు పాసుపుస్తం జిరాక్స్‌తో వచ్చి విత్తనాలు తీసుకోవాలని కోరారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళి

అనంతపురం కలెక్టరేట్ : గ్రంథాలయ ఉత్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని జిల్లా గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమామోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమంలో అయ్యంకి పాత్ర చాలా గొప్పదన్నారు. అంతేగాకుండా ఆయన గొప్ప సాహితీ వేత్తగా, గ్రంథాలయ సర్వస్వం పత్రికను ప్రారంభించి గ్రంథాలయాల ఉనికిని చాటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ, లైబ్రేరియన్లు ఇంతియాజ్, హేమమ్మలిని, రామాంజనమ్మ, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అంకితభావంతో మెలగాలి

అనంతపురం : విద్యార్థులు అంకితభావంతో మెలగాలని బాలాజీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక బాలాజీ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ విద్యార్థులు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి కళాశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ గీతావాణి, మస్తానయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళల ముందడుగు

జెఎన్‌టియు ప్రిన్సిపాల్ పి.సుజాత

ప్రజాశక్తి-అనంతపురం

మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందడుగు వేస్తున్నారని జెఎన్‌టియు ప్రిన్సిపాల్ పి.సుజాత తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారిత కోసం ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. ప్రధానంగా మహిళల ఆర్థిక, రాజకీయ స్వావలంబన కల్పించేలా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక చేయూత కోసం అమ్మఒడి, చేయూత, చేదోడు, విద్యాదీవెన కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇకపోతే జెఎన్‌టియులో సైతం ఉపకులపతి రంగజనార్ధన పరిపాలన పదవుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనకు అనుగుణంగా మహిళలకు అనేక బాధ్యతలు అప్పగించారన్నారు. ఇందులో భాగంగానే తాను అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నానని వివరించారు.



నగరంలోని శ్రీచైతన్య గర్ల్స్ విద్యాసంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

అనంతపురం : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీచైతన్య గర్ల్స్ విద్యాసంస్థల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళల చదువు ఇంటికి వెలుగు అన్నారు. మహిళలకు ఆర్థిక, రాజకీయ, వైద్య, విద్య రంగాల్లో సంపూర్ణ స్వేచ్ఛ ఇస్తే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. ఇందులో భాగంగా 'యాత్రనారీస్తూ పూజ్యంతే రమ్మంతే.. తత్రదేవత్తా-యాత్రే తాస్తూ నపూజ్యంతే సర్వసత్రా ఫల్లాక్రియ్హా' అనే శ్లోకాన్ని వివరించారు. సృష్టికి ఆధారం తల్లి అన్నారు. కావున ఒక్కరూ మహిళల్లో అమ్మని, చెల్లిని చూసుకోవాలన్నారు. సమాజంలో కదిలే దేవతలు మహిళలు అన్నారు. అనంతరం మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, డీన్ సత్యనారాయణ, సి ఇన్‌ఛార్జి చంద్రమోహన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని కేజీబీవీలో రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కబర్ది ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్‌లైన్ 1098 కోఆర్డినేటర్ బాలాజీ, న్యాయవాది గంగాధర్‌కుమార్, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి నసీమా మాట్లాడుతూ ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి ప్రపంచం



మాట్లాడుతున్న జెఎన్‌టియు ప్రిన్సిపాల్ పి.సుజాత

అంతటా మహిళా చట్టాల్లో పలు మార్పులను తీసుకొచ్చిందన్నారు. వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది సాదిక్, పారాలీగల్ వాలంటీర్ ఇస్మాయిల్, కేజీబీవీ ఉపాధ్యాయులు, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు



పెద్దవడుగూరు కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాలా నడుమ శ్రీదేవి, భూదేవి సమేతుడైనా లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలకు కళ్యాణం చేశారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను రథంపై ఉంచి తేరు గూడు వద్ద నుంచి ప్రధాన రహదారి వెంబడి కెనరా బ్యాంక్ వరకు మడుగు తేరు లాగారు. మధ్యాహ్నం కెనరా బ్యాంకు నుంచి పాత పోలీస్‌స్టేషన్, వైశ్యావీధి, పెద్దమ్మ ఆలయం మీదుగా రథాన్ని లాగుతూ తిరిగి తేరుమిద్దెలోకి చేర్చారు. ఎలాంటి అవాంఛనీయఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్‌కుమార్, బొట్టు శేఖర్, మధురాజు, రవికుమార్‌రెడ్డి, కులశేఖర్‌నాయుడు, తదితరులు స్వామిని దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాలను ఆలయ ఇఒ దుర్గాప్రసాద్, ఎంపిపి ఉమాదేవి, సర్పంచి అనూరాధ, ఉప సర్పంచి చంద్రమోహన్, పలువురు ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



రథోత్సవానికి హాజరైన అశేష భక్తులు

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే భవిష్యత్తు

ప్రజాశక్తి-నార్పల

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్ఐ రాఘవరెడ్డి తెలిపారు. శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవడం అలవర్చుకోవాలన్నారు. అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి అవసరమైన శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు విద్యాసామగ్రిని అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లగినేని నాగరాజు, గంగి పుల్లయ్య హైస్కూల్ కమిటీ ఛైర్మన్ ఈడిగ శ్రీధర్, రిటైర్డ్ కండక్టర్ ప్రసాద్, గొల్ల చంద్ర, బాబా నజీర్, వెంకటనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన మాదిగల సంగ్రామ పాదయాత్ర

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మందకృష్ణ మాదిగ నాయకత్వంలో వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన మాదిగల సంగ్రాయ యాత్ర రెండో రోజు మంగళవారం మండలంలో జూటూరు నుంచి గార్లదిన్నె, పసులూరు మీదుగా సాగింది. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎబిసిడి వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పెద్దిరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పొలిటికల్ సభ్యుడు ఆదినారాయణ, ఎపి చేనేత కార్మిక సంఘం తాలూకా అధ్యక్షులు చింతా పురుషోత్తం, ఎమ్మార్పీఎస్ నాయకుడు రవి మాదిగ, తాలూకా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, పెద్దపప్పూరు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, కంబగిరి పాల్గొన్నారు.

కుందుర్పి : మాదిగలకు ఎ, బి, సి, డి వర్గీకణ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిన బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించుదామని ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ సాకే గురుమూర్తి పిలుపునిచ్చారు. మాదిగల సంగ్రామ యాత్ర మంగళవారం రెండవ రోజు కుందుర్పి మండల పరిధిలో సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపు వర్గీకరణ చేస్తామని తమ మేనిఫెస్టోలో పొందుపరిచిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తయినా పట్టించుకోలేదన్నారు. కావున వెంటే వర్గీకరణ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాలూకా ప్రధాన కార్యదర్శి కృష్ణాపురం బాబు, మండల అధ్యక్షుడు వన్నూరుస్వామి, ఉపాధ్యక్షులు మారుతి, మండల ఇన్‌ఛార్జి పూల వెంకటేశులు, గౌరవాధ్యక్షులు చిలిమప్ప, కంబదూరు మండలాధ్యక్షులు గంపల రామంజి, ఉపాధ్యక్షులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా ప్రణయ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ



వైసిపి యువజన విభాగం జోనల్ (అనంతపురం, చిత్తూరు, సత్యసాయి, అన్నమయ్య జిల్లాలు) ఇన్‌ఛార్జిగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు యువనేత వై.ప్రణయ్‌రెడ్డిని నియమించారు. ఈమేరకు వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నియామకంపై ప్రణయ్‌రెడ్డితోపాటు ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ప్రణయ్ తెలిపారు.

వైసిపి నాయకుల సంబరాలు

బెలుగుప్ప : చిత్తూరు, అనంతపూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వేశ్వరరెడ్డి కుమారుడు ప్రణయ్‌రెడ్డిని నియమించడం పట్ల మంగళవారం మండల కేంద్రంలోని సాయిబాబా కళ్యాణ మండపంలో సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా కేక్ కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సి.పెద్దన్న, జెడ్పీటీసీ మమత త్రిలోక్‌నాథ్‌రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామాంజనేయులు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




బెలుగుప్పలో కేక్ కోసి సంబరాలు చేసుకుంటున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రంలో గాలి, వెలుతురు, నీరు, విద్యుత్ సౌకర్యాలపై స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాధ్యత వహించాలని సూచించారు. అలాగే కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయించుకోవాలన్నారు. వంద మీటర్ల వరకు పోలింగ్ కేంద్రానికి ఎవరినీ అనుమతించవద్దన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, కానుకలు వంచి ఇవ్వాలని చూస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ షకీలాబేగం, తహశీల్దార్ శ్రీనివాసులు, సీనియర్ క్లబ్ వెంకటేశ్వర్లు, అరే బాలకృష్ణ, వీఆర్వోలు వీఆర్ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో నిశాంత్‌రెడ్డి

దేశానికే ఆదర్శంగా రాష్ట్రం

విశాఖ సమ్మిట్ విజయవంతం వేడుకలో విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గంలో కేక్ కోసి తినిపిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

పెట్టుబడులను ఆకర్షించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నిర్వహణలో, మెరుగైన పాలన, పనితీరులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైన సందర్భంగా మంగళవారం పట్టణంలోని వినాయక కూడలిలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో వరుసగా పెట్టుబడులు, పారిశ్రామికవేత్తలు, ఉపాధి కల్పనకు అనువైన రాష్ట్రముగా పేరు తెచ్చుకుందన్నారు. ముఖ్యంగా ఇటీవల విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు అనూహ స్పందన రావడం, రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరగడం, ఆరు లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు పునాది వేయడం హర్షణీయమన్నారు. అంతేగాకుండా త్వరలో విశాఖపట్నంను దేశంలోనే ఆదర్శ నగరంగా మార్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు చుంచుల నాగప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు, గృహ నిర్మాణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ వార్డు సభ్యులు గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్ సక్సెస్‌తో రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల మేర పెట్టుబడులు తరలిరావడంతో దేశం మొత్తం ఏపీ వైపు చూస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. విశాఖలో సమ్మిట్ విజయవంతం కావడంతో మంగళవారం పట్టణంలో వైసిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో జరిగిన పెట్టుబడిదార్ల సదస్సులో విశేష స్పందన లభించి దాదాపు 352 ఎంఒయూలు, రూ.13 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు, 6 లక్షలకు ఉద్యోగాల కల్పనకు వేదిక కావడం సంతోషకర విషయమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, యువతకు ఉపాధికి ఇది దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్‌యాదవ్, హస్తకళల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ హరిత, ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మంజుల, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు సిపి వీరన్న, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఎంబీసీ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో కేక్ కోస్తున్న వైసిపి నాయకులు

నేరాలు ఘోరాలు

స్తంభం విరిగిపడి వ్యక్తి మృతి

నార్పల : మండల పరిధిలోని కేశేపల్లి గ్రామంలో చౌడేశ్వరి గుడి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభం విరిగిపడి కూలీ గోపీ (28) మృతిచెందినట్లు ఎస్ఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... పొట్టకూటి కోసం చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన కూలి పని చేసుకునే గోపీ కేశేపల్లిలో నిర్మించే ఆలయ నిర్మాణ పనులకు వచ్చాడు. ఇందులో భాగంగా మంగళవారం పని చేస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభం విరిగిపడి కింద పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గోపీ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని స్థానికులు కోరారు.

వేరుశనగ వామికి నిప్పు

శింగనమల : మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గాజుల శ్రీనివాసులు, గాజుల ప్రసాద్‌కు చెందిన వేరుశనగ వామి పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. పశు గ్రాసం నిమిత్తం వామిగా ఏర్పాటు చేసుకున్న వేరుశనకు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమై సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్‌సిబ్బంది మంటలను అదుపు చేశారు. వేరుశనగ వామికి నిప్పు పెట్టిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు.



కాలుతున్న వేరుశనగ వాములు

చలివేంద్రం ప్రారంభం

గుత్తి : ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం గుత్తిలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ నాయకులు సుంకం రఫీ, అబ్దుల్ జిలాన్, డిష్ అన్వర్, మార్తాడు అన్సర్, అబ్దుల్ ఖురేషీ, నూర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను నియమించండి : సిపిఎం

ఆత్మకూరు : మండలానికి వెంటనే తహశీల్దార్‌ను నియమించాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న తహశీల్దార్ నాగభూషణ ఆరోగ్య సమస్యలతో సెలవుపై వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ పరంగా ఏ పని కావాలన్నా జరగడం లేదన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తహశీల్దార్‌ను నియమించాలని కోరారు.

చిట్టి బుర్రల్లో కొత్త ఆలోచనలు

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో తహశీల్దార్ ఈశ్వరయ్య

బెలుగుప్ప : విద్యార్థుల చిట్టి బుర్రల్లో కొత్త ఆలోచనలు మెలిగితే విజ్ఞానవంతులుగా తయారవుతారని తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టి తెలిపారు. మంగళవారం స్థానిక సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ మారెన్న ఆధ్వర్యంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ వండర్స్- 2023) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో విద్యార్థులకు పుస్తకాల్లోని పాఠ్యాంశాలను బోధించడంతోపాటు పాఠ్యాంశాలకు సంబంధించిన నమూనాల ద్వారా విద్యార్థులకు బోధిస్తే మంచి విజ్ఞానవంతులుగా తయారవుతారన్నారు. ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా పిల్లలను నూతన సాంకేతిక పరిజ్ఞానం వైపు ఆలోచనలను రేకెత్తించాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం రత్నాకర్, బాలవిహార్ కరస్పాండెంట్ అమరా శివలింగారెడ్డి, శ్రీనివాస విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, డాక్టర్ ప్రియాంక, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంతి ఉపాధ్యాయుడు శిరిపురం నాగరాజు, డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి, ఉపాధ్యాయులు సంధ్య, శైలజా, రషీదా, అనిత, నాగవేణి, మంజుల, గౌతమి, మమత, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకిస్తున్న అతిథులు

ఎస్ఆర్ఐటిలో మోడల్ జి-20 యువ సమ్మేళనం

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ కళాశాలలో మంగళవారం జి.20 యువ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైనా, కెనడా, యూకే, టర్కీ, యుఎస్ఎ, జపాన్, రష్యా, సౌత్ అరేబియా, సౌతాఫ్రికా, సౌత్ కొరియా, టర్కీ, మెక్సికో వంటి దేశాల ప్రతినిధులు హాజరై పలు విషయాలను చర్చించారు. ముఖ్యంగా నూతన ఆవిష్కరణలు, లింగ సమానత్వం, లింగ సున్నిత్వం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, మహిళా సాధికారత వంటి వాటిపై క్షణ్ణంగా చర్చించారు.



మోడల్ జి.20 యువ సమ్మేళనంలో కరపత్రాలు విడుదల చేస్తున్న అతిథులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకు డబ్బుల ఎర

తాడిపత్రిలో పట్టుబడిన ముగ్గురు టిడిపి నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి తాడిపత్రి మండలంలో టిడిపి నాయకులు ఓటర్లకు డబ్బులను పంచేందుకు ప్రయత్నిస్తుండగా ఎన్నికల అధికారులు, పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం తాడిపత్రి మండల పరిధిలోని గన్నేవారిపల్లి కాలనీలో టిడిపికి చెందిన చింబిలి ప్రసాద్ నాయుడు, చింత శివశంకర్ రెడ్డి, కోన శివశంకర్‌లు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారన్న సమాచారంతో మండల ఎన్నికల అధికారి, ఈవోఆర్డీ జిలాన్ బాషా పోలీసులతో కలిసి గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. డబ్బులు పంచుతున్న ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద రూ.5 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని తాడిపత్రి పోలీసులు తెలిపారు.